క్లుప్తంగా

ధాన్యం లారీ బోల్తా



దామెర : మండలంలోని ఒగ్లాపూర్ వద్ద బుధవారం తెల్లవారుజామున జాతీయరహదారిపై అదుపుతప్పి ధాన్యం లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నల్గొండ నుంచి ఊరుగొండలోని మణికంఠ రైస్‌మిల్లుకు వెళ్తున్న క్రమంలో లారీ ఒగ్లాపూర్ వద్దకు రాగానే అతివేగంతో డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. లారీలో 800బస్తాలకు పైగా ధాన్యం ఉండగా రహదారిపైనే పడిపోయాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

అవినీతిపరులను శిక్షించాలి

కమలాపూర్ : దేశానికి అన్నం పెట్టే అన్నదాతల నుంచి లంచం తీసుకున్న అధికారులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకుడు ఉప్పుల శివ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఓ రైతు నుంచి రూ.5 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్ మాధవి, ధరణి ఆపరేటర్ రాకేశ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి లంచగొండి అవినీతి, అక్రమాలకు పాల్పడే కొంతమంది అధికారుల ప్రవర్తనతో ప్రభుత్వ అధికారులపై ప్రజల్లో నమ్మకం పోతోందని తెలిపారు. రానున్న రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే వెంటనే ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో పచ్చిరొట్టె, జీలుగా విత్తనాలను సబ్సిడీపై అందించనున్నట్లు ఏఓ గంగాజమున బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. బ్యాగు ధర రూ.1,116 ఉందని తెలిపారు. రైతులు వివరాలకు 9848528701ను సంప్రదించగలరని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై ఏసీపీ విచారణ



ఖిలా వరంగల్: ప్రేమ వివాహం చేసుకుని వరకట్న వేధింపులు, కులం పేరుతో దూషిస్తున్న ఓ వ్యక్తిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరామ్‌నాయక్ బుధవారం విచారణ చేపట్టారు. 2020వ సంవత్సరంలో పడమర కోటకు చెందిన శాబోతు స్వామి, లేబర్‌కాలనీకి చెందిన భార్గవి కులాంతర వివాహం చేసుకున్నారు. వారికి కుమార్తె పుట్టిన తర్వాత వారి మధ్య గొడవలు మొదలయ్యాయి. కార్యక్రమంలో ఏసీపీ రైటర్ నర్సయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కుట్ర కేసు నుంచి తొలగించాలి



కేయూ క్యాంపస్: మూడు నెలల క్రితం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ నేతలపై పూసపెల్లి కుట్ర కేసు పెట్టారని, ఆ కేసులో భాగంగా ఈనెల 21న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి పేరును చేర్చడాన్ని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు ఖండించారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ కేయూ కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ మొగిలి వెంకటరెడ్డిని పేరును పూసపెల్లి కుట్ర కేసులో చేర్చడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఇది ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. గడీల పాలనను బద్దలు కొట్టి ప్రజా పాలనను తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలాగే అణిచివేతలకు పాల్పడుతోందని ఆరోపించారు.

బోర్ పనులు ప్రారంభం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గుంటూరుపల్లి గ్రామ శివారులోని హలియా తండాలో బోర్ ఏర్పాటు పనులను మాజీ సర్పంచ్ కర్నాటి పార్వతమ్మ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో నీటి ఎద్దడిని నివారించే లక్ష్యంతో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బోర్‌ను మంజూరు చేయించినట్లు తెలిపారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారుపల్లి హనుమంతరావు పాల్గొన్నారు.

వికసిత జ్ఞానశాల ధర్మసాగర్ కళాశాల

- దాతల సహకారంతో ముందుకు
- ప్రిన్సిపాల్ చొరవతో పెరిగిన విద్యార్థుల నమోదు శాతం
- ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగిస్తూ కార్యక్రమాల నిర్వహణ



ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

ధర్మసాగర్ : మలిదశ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న కాలమది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం 100 జూనియర్ కళాశాలలను మంజూరు చేయగా అందులో మొదటగా 2000 సంవత్సరంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని ధర్మసాగర్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు అయ్యింది. నాటి నుంచి నేటి వరకు సుమారు 3500 మంది విద్యార్థులు ఈ కళాశాలలో ఇంటర్ విద్యను పూర్తి చేసుకున్నారు. వందలాది మంది విద్యార్థులు ఈ కళాశాలలో చదివి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ, ఉపాధి పొందుతున్నారు.

ప్రిన్సిపాల్ కృషితో మరింత ముందుకు..

ఎంతో వైభవం కలిగిఉన్న ఈ ప్రభుత్వ జూనియర్ కళాశాల గత కొన్ని సంవత్సరాలుగా దీనస్థితికి చేరుకుంది. రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడం, పర్యవేక్షణ కొరవడడం వలన మౌలిక వసతుల కల్పన, విద్యా ప్రమాణాల పరంగా చాలా వెనుకబడింది. అయితే ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కళాశాలలో విధులు నిర్వర్తించిన రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ, సామాజిక కార్యశీలి పురస్కార గ్రహీత ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ 2022 సంవత్సరంలో బదిలీపై ధర్మసాగర్ కళాశాలకు వచ్చారు. తక్కువ కాలంలోనే తనదైన పనితీరుతో అనూహ్య మార్పులు తీసుకొచ్చారు. 22–23, 23–24 విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదును 50 శాతానికి పెంచారు. కళాశాల పరిధిలోని ధర్మసాగర్, వేలేరు, మడికొండ ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి కెరీర్ గైడెన్స్, అభ్యసన నైపుణ్యాల పెంపుపై సదస్సులను నిర్వహించారు. కళాశాల సందర్శన కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులను, హెచ్‌ఎం, ఉపాధ్యాయులను ఆహ్వానించి కళాశాల వసతులు, ఆచరిస్తున్న విద్యా ప్రమాణాలను వివరించారు. అదే విధంగా జాతీయ సాంకేతిక విద్యా సంస్థ వరంగల్ ప్రొఫెసర్‌లతో గ్రామీణ ప్రాంత విద్యార్థులలో ఇమిడి ఉన్న శాస్త్ర సాంకేతికత పరిజ్ఞానం ఆవిష్కరణలపై ప్రేరణాత్మక ప్రసంగాలను ఏర్పాటు చేశారు. స్టడీ మెటీరియల్‌ను అందించారు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదివిన విద్యార్థులకు ఉన్నత విద్యలో అందనున్న రాయితీలను వివరించారు.

దాతల సహకారంతో అభివృద్ధి

అనేక మంది దాతల సహకారంతో కళాశాలను అభివృద్ధి వైపు నడిపించారు. కాంగ్రెస్ నేత అవేలి దామోదర్‌రావు సహకారంతో 200 మంది విద్యార్థుల కెపాసిటీ గల సెమినార్‌హాల్‌ను ఏర్పాటు చేశారు. వారాంతంలో ప్రభుత్వ విద్యా సంస్థల నుంచి ఎదిగిన ప్రముఖులతో సమావేశాలను నిర్వహించారు. కళాశాలకు గేటు, తరగతి గదులకు తలుపులు, కిటికీలను ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తమ నిధులతో ఏర్పాటు చేశారు. విద్యార్థుల కుటుంబ ఆర్థిక స్థితిగతుల సమాచారం సేకరించి వారి అవసరాలను తెలుసుకొని విద్యార్థులకు దుస్తులు, బస్‌పాస్‌కు డబ్బులు, బ్యాగులు, వాటర్‌బాటిళ్లు ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. రెగ్యులర్‌గా కళాశాలకురాని విద్యార్థులను గుర్తించి వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం కృషితో ఇటీవల విడులైన ఇంటర్ ఫలితాల్లో ఈ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అత్యున్నత మార్కులను కైవసం చేసుకున్నారు. హనుమకొండ జిల్లాలోనే మెరుగైన ఉత్తీర్ణత శాతంలో కళాశాల అగ్రస్థానంలో నిలిచింది. అలాగే కళాశాల క్రీడా మైదానానికి ప్రహరీ నిర్మాణం కోసం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు అయ్యేందుకు కృషి చేశారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో అభివృద్ధి కొనసాగిస్తున్నారు. కళాశాల సమయానికి అనుగుణంగా బస్‌లు ఏర్పాటు చేయించారు.



కళాశాల మైదానంలో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదువుకున్న..



నేను ప్రభుత్వ విద్యా సంస్థలల్లో చదువుకుని ప్రిన్సిపాల్ స్థాయికి ఎదిగాను. నా ఎదుగుదలకు అవసరమైన సౌకర్యాలు మా కళాశాల విద్యార్థులకు అందించాలని సంకల్పించాను. దీనికి మండల ఉపాధ్యాయులు, పౌరసమాజం, ప్రజాప్రతినిధులు, కళాశాల స్టాఫ్ సహకరించారు. తక్కువ కాలంలోనే ప్రజల నమ్మకాన్ని పొంది చక్కని ఫలితాలను సాధించాం. ఇటీవల విడులైన ఇంటర్ ఫలితాల్లో 70 శాతం ఉత్తీర్ణత సాధించాం. 2024–25 విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతున్నారు.

– అస్నాల శ్రీనివాస్, ప్రిన్సిపాల్

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి



దామెర : సూచనలు చేస్తున్న మాధవీలత



కమలాపూర్ : పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

దామెర : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత సూచించారు. మండలంలోని కోగిల్వాయి పాఠశాలలో కొనసాగుతున్న పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా పనులు పూర్తి చేయాలని అన్నారు. పనుల్లో నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ కల్పన, కార్యదర్శి సరళ తదితరులు ఉన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలోని అమ్మఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ గుండె బాబు అన్నారు. కానిపర్తి, ఉప్పల్ గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. కానిపర్తిలో 90 శాతం పనులు పూర్తి చేసిన వీఓ వనితను అభినందించారు. అనంతరం కానిపర్తి, దేశరాజుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించి పంచాయతీకార్యదర్శులకు సూచనలు చేశారు. రెండురోజుల్లో నర్సరీల్లోని మొక్కలను షిఫ్టింగ్, గ్రేడింగ్ చేసి ఎత్తుల వారిగా ఉంచాలని, ఖాళీ బ్యాగుల్లో ప్రస్తుతం దొరికే చింత, మునగ, బొప్పాయి, వేప, ఈత తదితర విత్తనాలను విత్తాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రమేశ్, ఈసీ కార్తీక్, ఆయా గ్రామాల వీఓలు, పంచాయతీకార్యదర్శులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు

- డీఆర్‌డీఓ నాగపద్మజ

నడికూడ : ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దని డీఆర్‌డీఓ నాగపద్మజ అన్నారు. మండలంలోని ముస్త్యాలపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచుల కొరత లేకుండా చూడాలని అన్నారు. ధాన్యాన్ని సాధ్యమైనంత త్వరగా మిల్లుకు తరలించాలని అధికారులకు సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, డీపీఓ ప్రకాశ్‌రాజ్, సీసీ రాజు, ఏపీఎం రమాదేవి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నాగపద్మజ

ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్‌ఎస్‌దే గెలుపు

- మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఆయన నివాసగృహంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు ప్రతి ఓటర్‌ను కలిసి రాకేశ్‌రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించాలన్నారు. ఇతర పార్టీల నాయకుల బెదిరింపులకు భయపడేది లేదన్నారు. ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, జాకీర్‌అలీ, పున్నం సంపత్, రవియాదవ్, మల్లయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తిని చిన్నరాజు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈనెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలో రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల మండల ఇన్‌చార్జ్ సోనబోయిన కిశోర్, యూత్ నాయకులు సోనబోయిన కిరణ్, మంతుర్తి రాకేశ్, మేరుగు సంతోష్, గణేష్, రవికుమార్, అరవింద్, ప్రసాద్, సునీల్, రాజు, కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



పరకాల : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పరకాల కోర్టులో న్యాయవాదులను కలిసి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ మేరుగు శ్రీనివాస్, నాయకులు సోదా రామకృష్ణ, కొలుగూరి రాజేశ్వర్ రావు, రంజాన్‌అలీ, న్యాయవాదులు పున్నం రాజిరెడ్డి, లక్కం శంకర్, సాబీర్, వెంకటరమణ, రాజేందర్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం



ఆత్మకూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో భాగంగా పెంచికలపేటలో బుధవారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బలవంతుల రాజు, మాజీ అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ఎన్నికల ఇన్‌చార్జ్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, ఓబీసీ జిల్లా కార్యదర్శి సముద్రాల రవి, మండల కార్యదర్శులు బయ్య పైడి, అల్లి మహేందర్, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ధర్మసాగర్ : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడనుందని ఏఈ సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా సాయిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు, ధర్మపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

బీఆర్‌ఎస్ పాలనలో అస్థిత్వం కోల్పోయిన కేయూ



మాట్లాడుతున్న మాచర్ల రాంబాబు

కేయూ క్యాంపస్: గత బీఆర్‌ఎస్ పాలనలో కాకతీయ యూనివర్సిటీ తన అస్థిత్వాన్ని కోల్పోయిందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు అన్నారు. యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ల కాలంలో వీసీగా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ రమేష్ తన కోటరీని కీలకమైన బాధ్యతల్లో ఉంచి విద్యార్థులు, అధ్యాపకులు, నాన్‌టీచింగ్ ఉద్యోగులను అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. వీసీగా రమేష్ అనేక అవకతకవలకు పాల్పడ్డారని అన్నారు. వీసీ లాడ్జ్ నుంచి కొన్ని కీలకమైన ఫైళ్లు మాయమయ్యాయన్నారు. సమావేశంలో ఏబీవీపీ కేయూ ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, నాయకులు గట్టు ప్రశాంత్, సాయి, చంద్రశేఖర్, కేయూ ఉపాధ్యక్షుడు రాజు బాధ్యులు లక్ష్మణ్, విష్ణు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణ మహోత్సవం



శాయంపేట : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



దామెర : కల్యాణం జరిపిస్తున్న పండితులు



ఆత్మకూరు : హోమం నిర్వహిస్తున్న అర్చకులు

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరిస్వామి దేవాలయంలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మత్స్యగిరిస్వామి, దేవి, భూదేవి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ సామల భిక్షపతి దంపతులు వారి ఇంటి నుంచి స్వామివారికి పట్టువస్త్రాలను, తలంబ్రాలను మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు, యాగ్నికులు వీరవెల్లి వేణుగోపాల చార్యులు వేదమంత్రాలతో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం గ్రామస్తుడు జిన్నా కృపాకర్‌రెడ్డి–రేఖా దంపతులు నూతన రథాన్ని ఆలయానికి బహూకరించారు. అనంతరం ఆలయ చైర్మన్ సామల భిక్షపతి రాజమణి దంపతులు మహా అన్నదానం నిర్వహించారు. గ్రామపెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి, అడ్వకేట్ లెక్కల జలెందర్‌రెడ్డి, వేణుపాల్, ప్రకాశ్, ప్రకాశ్, రాజు, ప్రభాకర్, సదానందం పాల్గొన్నారు.

ఊరుగొండలో నర్సింహస్వామి కల్యాణం

దామెర : మండలంలోని ఊరుగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వైశాఖ శుద్ధచతుర్థిని పురస్కరించుకొని ఉదయం పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ సంప్రదాయరీతిన స్వామివారి కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానఅర్చకుడు తూపురాణి శ్రీనివాసచార్యులు, అర్చకులు తూపురాణి వినయ్‌కుమార చార్యులు, మాజీ సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, రవి, సునీల్‌రెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లిలో గల నారసింహ క్షేత్రంలో నృసింహస్వామి జయంతి వేడుకలను యాజ్ఞికులు రవి ఆచార్యుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో నిత్యపూజల అనంతరం బహ్మోత్సవాల్లో నాల్గోరోజు నిత్యహవనం, పూర్ణాహుతి జరిపించారు. అనంతరం గర్భాలయంలో లక్ష్మీనరసింహ స్వామి, స్వయంభూ స్తంభ నారసింహులకు పంచామృతాలు, సుగంధ పరిమళద్రవ్యాలు, పండ్లరసాలు, ఓషధులతో విశేషమైన అభిషేకం నిర్వహించారు. ఆలయంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి, సీతారామచంద్రస్వామి, గోధాకృష్ణస్వామి, పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు ఒకే వేదికపై కనులపండువగా తిరుకల్యాణం జరిపించారు. సుమారు 1500 మందికి అన్నప్రసాద వితరణ చేపట్టారు. సమర్పకులుగా మార్నేని వెంకటేశ్వరరావు, రామారావు, లక్ష్మణ్‌రావు కుటుంబ సభ్యులు సహకారం అందిచినట్లుగా ఆలయ చైర్మన్ సత్యనారాయణ తెలిపారు.



ఐనవోలులో..

ఆత్మకూరులో బ్రహ్మోత్సవాలు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. నాలుగో రోజు విశేషంగా పూజలు చేశారు. సుదర్శన హోమం, ఉత్సవమూర్తులకు చక్రస్నానం, అభిషేకాలు చేశారు. అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు డింగరి శ్రీరామాచార్యులు, మరింగంటి సత్యనారాయణాచార్యులు, డింగరి శ్రీనివాసాచార్యులు, హరిఓమ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'సఖి' సేవలను వినియోగించుకోవాలి

హన్మకొండ అర్బన్: బాధిత మహిళలు, బాలికలు 181 సేవలు, సఖి వన్ స్టాప్ కేంద్రం సేవలను సద్వినియోగించుకోవాలని సఖి వన్ స్టాప్ కేంద్రం కేస్ వర్కర్ వినీల సూచించారు. నగరంలోని అడ్వకేట్స్ కాలనీలోని మను వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో హనుమకొండ సఖి వన్ స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురైన పిల్లల కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టం ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ యాక్ట్‌ను తీసుకొచ్చిందని వివరించారు. మహిళలపై వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ఆడపిల్ల వద్దని అకారణంగా గర్భవిచ్ఛిత్తి చేయించుకోవాలని వేధింపులకు గురి చేయడం, ఇతర వేధింపుల పట్ల మానసికంగా కుంగిపోయే మహిళలు, బాలికల రక్షణకు సఖి వన్ స్టాఫ్ కేంద్రం కృషి చేస్తోందని వివరించారు. బాధితులు 0870 – 2452112 లేదా టోల్‌ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు.



సదస్సులో మాట్లాడుతున్న వినీల

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్‌లోని శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన 1993 – 1994వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. 30 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు చేరుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం గురువులకు సన్మానించారు.

రేపు మెగా ఇంటలెక్చువల్ మీట్



నయీంనగర్: ఓరుగల్లు సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 24న సాయంత్రం హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో మెగా ఇంటలెక్చువల్ మీట్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ ఏ.సమ్మిరెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల గురించి ఈ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, ముఖ్య నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా గ్రాడ్యుయేట్లు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, ఆర్.రమేష్ రెడ్డి, అశోక్ రావు, ఆర్.జగదీశ్వర ప్రసాద్, పూర్ణచందర్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్. రమేష్ (S.R) : 9441557565 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)